వైవీయూ డిగ్రీ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బిఏ, బిఎస్‌సి, బిబిఏ, బిసిఏ, బికాం, బ్యాచిలర్ ఆఫ్ వొకేషనల్ 2,4,6 సెమిస్టర్ల పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు 80 కళాశాల నుంచి 55 కేంద్రాలలో 25,892 మంది విద్యార్థులు రాశారు. కడపలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, స్పిరిట్స్ డిగ్రీ కళాశాల కేంద్రాలను విశ్వవిద్యాలయ విసి ఆచార్య అల్లం శ్రీనివాస రావు, వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె.ఎస్.వి కృష్ణారావు తనిఖీ చేశారు. విసి విద్యార్థుల హాల్ టికెట్ల ను పరిశీలించారు. విద్యార్థులకు ఏ ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు. ఈ సందర్భంగా పరీక్ష నియంత్రణ అధికారి కృష్ణారావు మాట్లాడుతూ విసి ఆదేశాల మేరకు పరీక్షల్లో ప్రతి కేంద్రానికి అబ్జర్వర్లను నియమించామని, అదనంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తాయన్నారు.

12వ పిఆర్‌సి చైర్మన్‌ను
తక్షణమే నియమించాలి

- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

12వ వేతన సవరణ సంఘానికి (పిఆర్‌సి) తక్షణమే చైర్మన్‌ను నియమించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని యుటిఎఫ్ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే పిఆర్‌సి కమిషన్‌ను నియమిస్తామని, సకాలంలో డిఎలు ఇస్తామని, పెండింగ్ బకాయిలను చెల్లిస్తామని హామీలు గుప్పించి, తీరా అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించారని విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 మాసాలు పూర్తవుతున్నా ఇప్పటికీ 12వ పిఆర్‌సి చైర్మను నియమించకపోవడం దారుణమని వాపోయారు. 12వ పిఆర్‌సి చైర్మన్‌ను నియమించి, విధి విధానాలను రూపొందించి, సంఘాలతో చర్చలు నిర్వహించి ఐఆర్ ప్రకటించి అమలు చేసేందుకు మరింత జాప్యం నెలకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన మూడు డిఎలు ఇప్పటికీ చెల్లించలేదని, మరొక డిఎ జూలైకి రాబోతుందని, ఇప్పటికైనా పెండింగ్ డిఎలను తక్షణం చెల్లించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను రోడ్ మ్యాప్ ప్రకటించి, పూర్తిస్థాయిలో చెల్లింపులు చేపట్టకుండా కేవలం రూ.7500 కోట్లు మాత్రమే చెల్లించి, మిగతా రూ. 25 వేలకోట్ల బకాయిల చెల్లింపులపై స్పష్టత ఇవ్వకపోవడం తగదన్నారు. 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం 2017లో ఇచ్చిన మెమో 57ని ఇంత వరకు అమలు చేయకపోవడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో వ్యతిరేకత నెలకొని ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ ఉద్యమ కార్యాచరణ తీసుకుంటుందని హెచ్చరించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీ రాజా, ఎస్.నవ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యారంగ వినాశకారి అయిన 117 జీవోను రద్దు చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం, జీవోను బేషరతుగా రద్దు చేయకుండా, ప్రత్యామ్నాయ విధానం పేరుతో కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్‌ను ప్రవేశపెట్టే పేరుతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలను మూసి వేస్తున్నారని ఆరోపించారు. వీరిని విద్య పేరుతో ఊరి బడి దూరమైతే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి గ్రామ పంచాయతీకి ఒక మోడల్ ప్రాథమిక పాఠశాలను అన్ని హంగులతో ఏర్పాటు చేయాలని, మిగిలిన ప్రాథమికపాఠశాలలను యథాతథంగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. 60 మంది విద్యార్థులు దాటిన ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూళ్లుగా అప్ గ్రేడ్ చేసి, మిగిలిన యూపీ పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు, గౌరవ అధ్యక్షులు ఎస్.నాగార్జున రెడ్డి, జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, కె.వెన్నయ్య, సి.శ్రీనివాసులు, ఎస్.ఎజాస్ అహ్మద్, మురళీకృష్ణ, ప్రసన్న లక్ష్మి, ఎన్.చంద్ర ఓబుల్ రెడ్డి, ఎ.శ్రీనివాసులు, నగర ప్రధాన కార్యదర్శి మహబూబ్ షరీఫ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.రూతు ఆరోగ్య మేరి, డి.క్రిష్ణారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, ఐక్య ఉపాధ్యాయ పత్రిక జిల్లా ఇన్‌ఛార్జి జి.గోపీనాథ్ పాల్గొన్నారు.

డిసిసిబి, డిసిఎంఎస్ చైర్మన్ల నియామకం

డిసిసిబి చైర్మన్‌గా బి.సూర్యనారాయణరెడ్డి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రభుత్వం నామినేటెడ్ పదవుల నియామకాలను వేగవంతం చేసింది. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మూడు, నాలుగు దఫాలుగా నామినేటెడ్ పోస్టులకు నియామకాలు చేపట్టిన సంగతి తెలిసిందే. సోమవారం జిల్లాకు చెందిన ప్రధాన సహకార బ్యాంకుల సంఘాల సంస్థలైన డిసిఎంఎస్, డిసిసిబి చైర్మన్ పదవులకు అభ్యర్థులను నియమించింది. డిసిసిబి చైర్మన్‌గా అట్లూరు మండలానికి చెందిన బి.సూర్య నారాయణరెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్‌గా యర్రగండ్ల జయప్రకాష్ నియమితులయ్యారు. డిసిసిబి చైర్మన్ బి.సూర్యనారాయణరెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్‌లతో సన్నిహిత సంబంధాలు ఉన్న నేపథ్యంలో చైర్మన్ పదవులు లభించినట్లు తెలుస్తోంది. డిసిఎంఎస్ చైర్మన్ పదవి యర్రగండ్ల జయప్రకాష్ అనూహ్యంగా లభించడం చర్చనీయాంశంగా మారింది.

తరగతి గదికి కమ్యూనికేషన్ ప్రధానం : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

అంగ్ల భాషలో చక్కటి కమ్యూనికేషన్ నైపుణ్యాలతో అధ్యాపకులు తరగతులను ప్రభావవంతంగా నిర్వహించగలరని విశ్వవిద్యాలయ విసి ఆచార్య అల్లం శ్రీనివాస రావు అన్నారు. 'ఎఫెక్టివ్ క్లాస్ కమ్యూనికేషన్ ఫర్: టీచింగ్ కమ్యూనిటీ' అంశంపై అంతర్జాల సదస్సు సోమవారం విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విసి మాట్లాడుతూ సబ్జెక్టు నాలెడ్జి లోతైన పరిశోధన జ్ఞానం, ఆంగ్లంలో చక్కటి భావవ్యక్తీకరణ నేటి గురువులకు అవసరమన్నారు. నాలెడ్జ్ షేరింగ్‌కు, స్వీకరణకు ఉపయోగపడుతుందన్నారు. కీలక ఉపన్యాసకులుగా హాజరైన ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె. వెంకటరెడ్డిని విసి అభినందించారు. వైవీయూ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఆంగ్ల భాషలో భావవ్యక్తీకరణ విస్తృత అవకాశాలు కలిగిస్తుందన్నారు. ప్రపంచంతో కమ్యూనికేట్ చేయడానికి అంగ్ల భాష ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సహ ఆచార్యులు డాక్టర్ టి. చంద్రశేఖర్, డాక్టర్ జయంత్ కశ్యప్, ఆచార్య రియాజున్నీసా, ప్రజా సంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి సరిత, అధ్యాపకులు విద్యార్థులు స్కాలర్లు పాల్గొన్నారు.

ఫిర్యాదు దారులకు న్యాయం చేయండి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్‌పి మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అరెస్టు చేయడం అన్యాయం

ప్రజాశక్తి - కడప

జనగణనతో పాటు బిసి కుల గణన జరగాలని, బిసి రక్షణ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు శాంతియుతంగా ర్యాలీ చేస్తుంటే అరెస్టు చేయడాన్ని బీసీ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాగరాజు, గౌరవాధ్యక్షులు పి గౌరవాధ్యక్షులు పి గురు స్వామి. గురుస్వామి అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వానికి బిసి చేసిన సహకారాన్ని మరిచిపోవద్దన్నారు. తెలంగాణలో బిసి కుల జనగణన జరగడం, 42 శాతం రిజర్వేషన్లను కల్పించారని చెప్పారు. తమనాయకుడు చేస్తున్న న్యాయపోరాటానికి తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు వారు తెలిపారు. విలేకరుల సమావేశంలో రాజకీయ విభాగం అధ్యక్షులు రామాంజనేయులు, త్రివిక్రమ్ యాదవ్, కళ్యా సుధాకర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి

కొప్పర్తిలోనే ఎంఎస్ఎంఇ

- టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

కొప్పర్తిలోనే ఎంఎస్ఎంఇ ఉంటుందని, ఎక్కడికి తరలి వెళ్లలేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ద్వారకా నగర్‌లోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొప్పర్తి విషయంలో వైసిపి విమర్శల్లో వాస్తవాలు లేవని పేర్కొన్నారు. కొప్పర్తిలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ త్వరలో ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. బుగ్గ వంక ప్రక్షాళనానికి చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఐటి పార్కుకు 10 ఎకరాలు కేటాయించారని తెలిపారు. షామీరియా మసీదు వద్ద, లా కాలేజీ వద్ద బుగ్గ వంక పై బ్రిడ్జిలు నిర్మిస్తామని పేర్కొన్నారు. మన కడప-స్వచ్ఛ కడపకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. క్లీన్ కడపను సాధిస్తామని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహించామని గుర్తు చేశారు. జిల్లా అభివృద్ధిలో కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్ కీలక భూమిక పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసిపి హయాంలో మద్యం కుంభకోణంలో రూ.3 వేల కోట్ల పైచిలుకు అవినీతి చోటు చేసుకుందని తెలిపారు. భూములు, ఇసుక, ప్రభుత్వ సంపదను కొల్లగొట్టారని విమర్శించారు. కుంభకోణాలు బయటపడే కొద్దీ జగన్ కనపడడం లేదని చెప్పారు. ఉనికి కోసం ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయని పేర్కొన్నారు. జూన్‌లో తల్లికి వందనం అమలు చేస్తామని వివరించారు.

టీ స్టాల్‌లో అగ్ని ప్రమాదం

- మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి-కడప అర్బన్

మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

చిన్న చౌక్ సుజుకి షోరూం ఎదురుగా రామ చంద్రకు చెందిన టీ స్టాల్ అగ్ని ప్రమాదానికి గురైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘ టనా స్థలానికి చేరుకుని మంట లను ఆర్పివేశారు. ప్రమా దంలో టీస్టాల్‌లోని కుర్చీలు, టేబులు, ఫ్యాన్లు, సామగ్రికి కాలిపోయాయని యజమాని పేర్కొన్నారు. సుమారు రూ.4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు. ప్రమాదానికి విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తోనే ప్రమాదం చోటు చేసుకుందని జిల్లా అగ్ని బాపక సహాయ అధికారి బసివి రెడ్డి తెలిపారు. వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రమాదం సంభవించిన సమయంలో జాగ్రత్తగా వ్యవహరించి తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు.

అర్జీల పట్ల సత్వరమే స్పందించాలి : డిఆర్‌ఒ

ప్రజాశక్తి - కడప : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన స్పందించి నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో డిఆర్‌ఒ డిప్యూటీ కలెక్టర్లలతో కలిసిప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ఒంటిమిట్ట మండలం నరవకాటిపల్లె గ్రామం నుండి షేక్ గఫార్ రహిమాన్ ఇంటి స్థలానికి ప్రాసెసింగ్ సర్టిఫికెట్ కోరుతూ జిల్లా రెవెన్యూ అధికారికి అభ్యర్థించారు. కమలాపురం మండలం అప్పాయపల్లె నుంచి ఎం. మునీర్ అహ్మద్ సర్వే నెం. 847/ఎ లోని 4.79 ఎకరాల భూమి రెవెన్యూ ఆన్ లైన్ రికార్డుల్లో. ఎండోమెంట్ భూమిగా చూపిస్తోందని, రికార్డులను సవరించి న్యాయం చేయాలని విన్నవించారు. కడప నగరం ప్రకాష్ నగర్‌కు చెందిన టి. నారాయణ రెడ్డి తనకు చెందిన ఇంటి స్థలాన్ని ఇతరులు ఆక్రమించి, అక్రమంగా గేటును కూడా ఏర్పాటు చేశారని అధికారులు కల్పించుకుని న్యాయం చేయాలని పేర్కొన్నారు. సికె దిన్నె మండలం మామిళ్లపల్లెకు చెందిన కృష్ణారెడ్డి తనకు ఎలాంటి భూమి సంబందిత ఆస్తులు లేవని, కానీ ఆన్‌లైన్‌లో తన మీద భూమి ఉన్నట్లు చూపుతోందని, తద్వారా తన కుమారుడికి ప్రభుత్వ ఉపకార వేతనం అందకుండా పోయిందని ఆన్‌లైన్‌లో తనపేరుతో ఉన్న రికార్డు వివరాలను తొలగించాలని కోరారు.

పుచ్చలపల్లి సుందరయ్య జయంతిని పురస్కరించుకుని
మున్సిపల్ కార్మికుల రక్తదానం

శిబిరాన్ని ప్రారంభించిన కమిషనర్, హెల్త్ ఆఫీసర్

ప్రజాశక్తి - కడప అర్బన్

రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

పుచ్చలపల్లి సుందరయ్య 112 వ జయంతిని పురస్కరించుకుని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సోమవారం కార్పొరేషన్ ఎదుట ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కమిషనర్ మనోజ్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో మున్సిపల్ కార్మికులు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. రక్తం అవసరం ఉన్నవారికి ఇలాంటి శిబిరాలు ద్వారా సేకరించిన రక్తం ఉపయోగపడుతుందని చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారి అవసరాలు తీరుతాయని పేర్కొన్నారు. ఇలాంటి పనులు చేస్తున్న వారిని అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిఐటియు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, పి.వెంకటసుబ్బయ్య, మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు సుంకర రవి, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపాలు, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్, ఉపాధ్యక్షులు ప్రకాష్, సిఐటియు నగర కమిటీ సభ్యులు సుంకర కిరణ్ మాట్లాడారు. పుచ్చలపల్లి సుందరయ్య 1913లో నెల్లూరు జిల్లా అలగానిపాడు గ్రామంలో పెద్ద భూస్వామ్య కుటుంబంలో జన్మించారని తెలిపారు. ఆయన చిన్నతనం నుంచి పేదలు, బడుగు, బలహీన వర్గాల అంటే చాలా మక్కువని చెప్పారు. దేశంలోనే మొదటిసారిగా నెల్లూరు జిల్లా అలగానిపాడులో వ్యవసాయ కూలీ సంఘం ఏర్పాటు చేసి వ్యవసాయ కూలీలకు సంక్షేమం, పేదల ఆరోగ్యం, బాగోగులు దగ్గరుండి చూసేవారని పేర్కొన్నారు. అలాంటి వారి జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ యూనియన్ పిలుపును అందిపుచ్చుకుని కార్మికులు రక్తదానం చేయడం చాలా ఆనందకరమని తెలిపారు. కడప నగర వాసుల మలినాలను తీసివేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న మున్సిపల్ కార్మికులు నగరాన్ని సుందరంగా దిద్దడంలో, మంచినీరు, విద్యుత్ దీపాలు సక్రమంగా ఉంచడంలో గాని కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. రక్తదానం చేయడం గర్వించదగ్గ విషయని పేర్కొన్నారు. ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉంటే వారికి ఉపయోగపడటానికి రక్తదానం చేయడం మంచిదన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అధికారులు, నగర నాయకులు శ్రీధర్, నాగరాజు, అరుణ్, శీను, దాము, నాగయ్య, స్టీఫెన్, పవన్, కృష్ణ, దస్తగిరి, మొదీన్, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

ప్రజాశక్తి - కడప అర్బన్

అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏడీ

కెఎస్‌ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల ఎన్ ఎస్-ఎస్ యూనిట్ ఆధ్వ ర్యంలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దివ్యాం గుల శాఖ ఎడి ఆర్.వి.కృష్ణ కిషోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాలు వ్యక్తిగత జీవితంలోనే కాదు,కుటుంబాన్ని, సమాజాన్ని ప్రభావితం చేస్తాయని తెలిపారు. విద్యార్థులు దుష్ప్రభావాల నుంచి దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ లావణ్య రెడ్డి మాట్లాడుతూ యువతపై మత్తు పదార్థాల ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఒక్కసారి మత్తు పదార్థాలకు బానిసైతే అలవాటు నుంచి బయటపడడం చాలా కష్టమని హెచ్చరించారు. భవిష్యత్తు గురించి బాధ్యతగా ఆలోచించాలని వివరించారు. కార్యక్రమంలో, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెఒఆర్ఎంలో మాక్ పాలిటెక్నిక్ పరీక్ష

ప్రజాశక్తి - కడప అర్బన్ : కెఒఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం మాక్ పాలిటెక్నిక్ పరీక్ష నిర్వహించారు. పాలిసెట్‌లో విజయం సాధించేందుకు ఉత్సాహంగా ముందుకు సాగుతున్న బాలికల కోసం ప్రత్యేక మాక్ పాలిసెట్ పరీక్షను విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థుల నుంచి విశేషమైన స్పందన లభించింది. కార్యక్రమం ప్రారంభంలో, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఒక ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ప్రిన్సిపల్ లావణ్య రెడ్డి మాట్లాడుతూ కలలను నిజం చేసే తొలి గడప అని పేర్కొన్నారు. ఆపై విద్యార్థులు 120 నిమిషాల మాక్ పరీక్షను రాయడం ద్వారా తమ ప్రతిభను నిరూపించుకున్నారని తెలిపారు. ప్రతి క్షణం విద్యార్థుల నమ్మకాన్ని, పోరాటాన్ని ప్రతిబింబించిందని చెప్పారు. పాలీసెట్ కో-ఆర్డినేటర్లు, హెచ్ఒడి రెడ్డిమురళి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ

ప్రజాశక్తి - బద్వేలు

జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో ఈనెల 22న పర్యాటకులపై కొంతమంది మతోన్మాద తీవ్రవాదులు దాడులు చేసి; వారిని మతం అడిగి మరీ అత్యంత కిరాతకంగా చంపడాన్ని నిరసిస్తూ బద్వేలు న్యాయవాదులు సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ అమాయకపు పర్యాటకులను మతం అడిగి మరి 26 మందిని నిర్దాక్షిణ్యంగా చంపడం చాలా హేయమైన చర్య అన్నారు. దీని వెనుక పాకిస్థాన్ దేశం హస్తం ఉందని, ఆధారాలు కూడా ఉన్నందున ఆ దేశానికి సరైన బుద్ధి చెప్పాలని, భారత ప్రభుత్వాన్ని కోరారు. తీవ్ర వాదంపై భారత దేశ ప్రభుత్వం తీసుకొను ఏ చర్యకైనా భారత దేశ ప్రజల సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయ వాదుల సంఘం అధ్యక్షులు డివిఎస్ఆర్ కృష్ణ, జనరల్ సెక్రెటరీ మురళీ కృష్ణ, సీనియర్ న్యాయవాదులు బ్రహ్మారెడ్డి, రాజేశ్వరరావు, ప్రదీష్ కుమార్ పవార్, ఓబుల్ రెడ్డి, సూర్య నారాయణరెడ్డి, సురేష్ బాబు, శ్రీధర్ నాయుడు, బొల్లు భాస్కర్, దామోదర్, పోలు ప్రవీన్, పోలు రేవంత్, నూతి శ్రీనివాసులు, రమణా రెడ్డి, విజయ్ కుమార్, రాజ్ కుమార్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

విలువైన భూములు ప్రయివేట్ పరం చేయడం తగదు

- వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు దేవిరెడ్డి ఆదిత్య

ప్రజాశక్తి - కడప

టిడిపి ప్రభుత్వం రాష్ట్రంలోని విలువైన భూములను ప్రయివేట్ పరం చేయడం దారుణమని వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు దేవిరెడ్డి ఆదిత్యరెడ్డి విమర్శించారు. టిడిపి ప్రభుత్వం ఒక్క రూపాయికే ఎకరా భూమిని టిసిఎస్ కంపెనీతోపాటు ఊరు పేరులేని ఉర్సా కంపెనీకి 60 ఎకరాలను దారాదత్తం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కడప నగరంలోని వైసిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంపద సృష్టిస్తానని తరుచూ చెప్పే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇలా విలువైన భూములను ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించడం ఏమిటని ప్రశ్నించారు. విజనరి అని చెప్పే సిఎం ఇలా విలువైన ఎకరాల భూమిని అప్పగించి కిడ్‌ప్రోకు పాల్పడినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం వైజాగ్‌లోనే స్పెషల్ ఎకానమిక్ జోన్ ఏర్పాటు చేసి వివిధ సంస్థలను ఏర్పాటు చేయించి ప్రోత్సహిస్తోందన్నారు. అక్కడ టిసిఎస్, ఉర్సా కంపెనీకి స్థలం కేటాయించకుండా విలువైన భూములు కలిగిన ప్రాంతంలో కేటాయించడంలో మతలబు ఏమిటో చంద్రబాబు చెప్పాలన్నారు. ప్రభుత్వం రూపాయికే ఎకరా భూమి కేటాయింపుపై వైసిపి యువజన విభాగం ఉద్యమించి భూ భాగోతాన్ని ప్రజలకు వివరించడం జరుగుతుందని వివరించారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు సుహేల్ అహ్మద్, ఫయాజ్, బాబు, గుంటి నాగేంద్ర పాల్గొన్నారు.

జిజిహెచ్ ప్రిన్సిపల్ బదిలీ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ బదిలీ అయ్యారు. ప్రభుత్వం రాష్ట్రంలోని పలు వైద్య కళాశాలల ప్రిన్సిపళ్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. సురేఖ 2022 నుంచి ఇక్కడ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నంద్యాల ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ త్వరలో రిటైర్మెంట్ కానున్న నేపథ్యంలో సురేఖ అభ్యర్థన మేరకు నంద్యాలకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో ప్రకాశం జిల్లాకు చెందిన జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ జమున నియమితులయ్యారు. ఈనెలాఖరులోపు సురేఖ రిలీవ్ కానున్నారు.

మాట్లాడుతున్న వైసిపి మహిళా జిల్లా అధ్యక్షులు తెలుగు పులి వెంకటసుబ్బమ్మ

మహిళలకు రక్షణ కరువు : వైసిపి

ప్రజాశక్తి - కడప

చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని వైసిపి కడప జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు తెలుగు పులి వెంకట సుబ్బమ్మ, నగర అధ్యక్షురాలు బండి దీప్తి అన్నారు. ఉద్యోగాల పేరుతో మహిళలను వంచిస్తున్న కడప ఎమ్మెల్యే పిఎ వాహిద్‌పై ఇంతవరకు కేసు నమోదు చేయకపోవడం దారుణం అన్నారు. సోమవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహిళా ఎమ్మెల్యే ప్రాతినిథ్యం వహిస్తున్న కడపలో మహిళకు అన్యాయం జరిగిందన్నారు. స్వయాన ఎమ్మెల్యే పిఎ మహిళలను మోసం చేస్తున్నా ఇంతవరకు ఎమ్మెల్యే స్పందించలేదు అన్నారు. బాధిత మహిళకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది అని ఈ సందర్భంగా వారు అన్నారు. వాహిద్‌పై గృహహింస చట్టం, హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రగల్భాలు పలకడం కాదని, ఆమె వద్ద పనిచేసే పిఎ మహిళలను మోసం చేస్తున్నాడని, ముందు అది గమనించండి అని హితవు పలికారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడంపై ఉన్న శ్రద్ధ మహిళలకు న్యాయం చేసే దాని పై పెట్టాలన్నారు. విలేకరుల సమావేశంలో మహిళ వైసిపి నాయకులు రత్నకుమారి, నారాయణమ్మ, శాంతమ్మ, మూలే సరస్వతి, మరియలు, శ్రీదేవి పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో విఫలం

ప్రజాశక్తి - కడప : శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఆర్‌టిఐ చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం శాంతి భద్రత పరీక్షల విషయంలో విఫలం అయిందనడానికి లక్ష్మీనారాయణ దారుణ హత్య ప్రత్యక్ష నిదర్శనం అని పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చిప్పగిరి లక్ష్మీ నారాయణ దారుణమైన హత్య ఘటనను ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోంది అన్నారు. హత్యకు కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో, అరాచక శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. లక్ష్మీ నారాయణ కుటుంబానికి మద్దతుగా నిలుస్తూ, న్యాయం కోసం తమ పోరాటం కొనసాగుతుంది అన్నారు.

చెస్ టోర్నమెంట్‌లో అమీనా ప్రతిభ

ప్రజాశక్తి - కడప

అమీనాను అభినందిస్తున్న అతిథులు

కడపకు చెందిన ర్యాపిడ్ చెస్ రేటెడ్ ప్లేయర్ అమీనా బెంగళూరులోని మంజునాథ కళ్యాణ మండపం, వైట్ ఫీల్డ్ లో నిర్వహించిన 56వ బిఆర్‌డిసిఎ జాతీయ స్థాయి ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో సత్తా చాటారు. ఆమె అండర్-10 బాలికల విభాగంలో 3 పాయింట్లు స్కోరు చేసి 6వ స్థానం సాధించారు. అమీనా విజయానికి గుర్తింపుగా కర్ణాటక చెస్ సంఘం ఉపాధ్యక్షుడు చిదానంద చేతుల మీదుగా పతకం అందుకున్నారు. ఇతర కడప ఆటగాళ్లు దేవాంశ్ 4 పాయింట్లు, భద్ర 3.5 పాయింట్లు, అలీముద్దిన్ 3 పాయింట్లు, చేతన్ 2 పాయింట్లు, శౌర్య 2 పాయింట్లు సాధించి విజయపథంలో నడిచారు. కడప చెస్ క్రీడాకారులు ఈ టోర్నమెంట్ ద్వారా తమ ప్రతిభను జాతీయ స్థాయిలో చాటడం విశేషం.

'సంవిధాన్ బచావో అభియాన్'ను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి - కడప : భారత రాజ్యాంగాన్ని రక్షించేందుకు సంవిధాన్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిసిసి అధ్యక్షులు ఎన్ డి.విజయ జ్యోతి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. అహ్మదాబాద్‌లో ఎఐసిసి సమావేశం, బెల్గావిలో నిర్వహించిన విస్తృతీకృత సీడబ్ల్యూసీ సమావేశం నిర్ణయం ప్రకారం భారత రాజ్యాంగాన్ని రక్షించేందుకు 40 రోజుల పాటు కొనసాగే జాతీయ స్థాయి ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించాల్సిన అవసరాన్ని మళ్లీ పునరుద్ఘాటించారు. ఈనెల 29న ఉదయం 11 గంటలకు కడప జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం ఉంటుందన్నారు.

ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

జీతాలివ్వాలంటూ సచివాలయ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - వేంపల్లె

రెండు నెలలుగా తమకు జీతాలు ఇవ్వలేదని వేంపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు వెంటనే జీతాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం ఎంపిడిఒ కుళాయమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ వేంపల్లె పంచాయతీ పరిధిలోని 8 గ్రామ సచివాలయాల్లో 60 మంది సిబ్బంది ఆయా విభాగాల్లో పని చేస్తున్నారని తెలిపారు. వీరికి వేంపల్లె పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జీతాలు వచ్చేవని, ఇటీవల ఆయనను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారన్నారు. ఈ పరిస్థితుల్లో తమకు రెండు నెలలు నుండి జీతాలు రాలేదన్నారు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఈ విషయమై గతంలో కూడా ఎంపిడిఒకు విన్నవించామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి జీతాలు మంజూరు చేయాలని కోరారు.

నేడు కడపలో ఉద్యాన సమ్మేళనం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఉద్యానశాఖాధికారి రాఘవేంద్రరెడ్డి

ఉద్యాన పంటలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు ఆ శాఖ ఈనెల 29న మంగళవారం కడప పట్టణ రాయచోటి రోడ్డులో ఉన్న మాధవి కన్వెన్షన్ సెంటర్‌లో ఉద్యాన సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉద్యాన శాస్త్రవేత్తలతో పంట సాగుపై ప్రసంగాలు, ఉద్యాన రంగంలో ఉన్న వివిధ నిష్ణాతులచే ప్రసం గాలు, ఆధునిక సాంకేతికతపై ప్రసంగాలు రైతులు, వ్యాపారస్తులు, ఎగుమ తిదారులచే మార్కెటింగ్ అనుసంధానం వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలి పారు. ఉద్యాన రంగంలో నూతన సాంకేతిక, రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లు, వాతావరణ మార్పులు, మార్కెటింగ్ అంశాలపై ప్రధానంగా చర్చిస్తారని తెలి పారు. కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పిలుపునిచ్చారు. ఆ మేరకు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సోమవారం శివకుమార్ ఆధ్వర్యంలో కర పత్రాలను సిఐటియు నాయకులు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రమీల, కళావతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు హైమావతి, చంద్రకళ, గంగాభవాని, విజయమ్మ, భవాని, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు చంద్ర, ఓబులేసు పాల్గొన్నారు.

అన్నదానానికి దాతలు సహకరించాలి

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం ఆవరణలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్ కోరారు. సోమవారం భద్రకాళి సమేత వీరభద్రస్వామి అన్నదాన సత్రంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లాడుపల్లె దేవళాలు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు పల్లకి సేవను నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీస్వామి వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి, సమరసత సేవా సంస్థ ప్రతినిధులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ చేస్తున్న పెరుగు వీరనారాయణ యాదవ్

క్రైం కార్నర్

నిద్రిస్తున్న మహిళ మెడలో సరుడు చోరీ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

దొంగలు లాక్కెళ్లగా మిగిలిన సగం సరుడు

మండలంలోని జవుకు పల్లి గ్రామానికి చెందిన మాజీ వీర జవాన్ బసిరెడ్డి దశరథరామిరెడ్డి భార్య మాధవి ఆదివారం రాత్రి ఆరుబయట నిద్రిస్తుండగా దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆమె మెడలో ఉన్న నాలుగున్నర తులం బంగారు సరుడును లాగగా.. మాధవి దొంగలు అంటూ కేకలు వేసింది. ఆమె తోటికోడలు శశికళ కూడా దొంగలని అరవగా పారిపోయారు. మాధవి మెడలోని సగం గొలుసును లాక్కెళ్లారు. గ్రామస్తులు దొంగల కోసం చుట్టూ పక్కల వెతికినా వారు దొరకలేదు. విషయాన్ని పోలీసులకు తెలపడంతో వారు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. విచారిస్తున్నారు.

పత్రాల్లేని మోటర్ సైకిళ్లు, ఆటో స్వాధీనం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక ప్రకాష్ నగర్‌లో సరైన పత్రాలు లేని 41 మోటర్ సైకిళ్లను, ఒక ఆటోను సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు సిఐ నరేష్ బాబు తెలిపారు. కొండాపురం, ముద్దనూరు సిఐలు, తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ, పోలీసులు పాల్గొన్నారు. పేకాట ఆడుతున్న ఏడు మందిని అరెస్టు చేసినట్లు సీఐ నరేష్ బాబు తెలిపారు. ఆదివారం రాత్రి ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ప్రకాష్ నగర్ ఎదురుగా ఉన్న నాపరాయి పాలిష్ మిషన్‌లో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.78,530 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పోలీసులు సీజ్ చేసిన మోటర్ బైక్‌లు

వట్టి పసుపు తయారీలో రైతులు నిమగ్నం

యంత్రం ద్వారా పసుపు కొమ్ములను ఉడికిస్తున్న కూలీలు

ప్రజాశక్తి - చాపాడు

పచ్చ బంగారంగా చెప్పుకునే పసుపు పంట నూర్పిడిని పూర్తి చేసిన రైతులు వట్టి పసుపుగా తయారీ పనులను ముమ్మరం చేశారు. పొలంలో నుంచి తీసిన కొమ్ములను (పచ్చికొమ్ములు) రైతులు ఉడకబెట్టి ఎండి బెడతారు. దీన్ని వట్టి పసుపు అంటారు. పసుపు పంటను ఉడికిం చేందుకు కూలీలు, సామగ్రి, ఇంధన ఖర్చులు అధికమవ్వడంతో ఈ ఏడాది రైతులు అధికంగా యంత్రాలను ఉపయోగిస్తున్నారు. యంత్రం ద్వారా ఒకే సారి మూడు పుట్ల వరకు పచ్చి పసుపును ఉడికించే వెసలుబాటు ఉం టుంది. తద్వారా పని సులభం అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. యం త్రానికి ఒక రౌండ్‌కు రూ.800 బాడుగ చెల్లించాల్సి వస్తుంది. వేడి చేసేం దుకు కావలసిన కలప, రబ్బర్ టైర్లు మాత్రం రైతులు సమకూర్చాల్సి ఉంది. అయితే యంత్రం ద్వారా ఉడికించిన పసుపు త్వరగా ఎండు పసుపుగా మారుతుందని రైతులు పేర్కొంటున్నారు. గతంలో ఎకరా పొలంలోని పసుపును ఉడికించేందుకు రెండుమూడు రోజుల సమయం పట్టేది. ప్రస్తుతం యంత్రం ద్వారా 4గంటలలోనే పూర్తి అవుతుందని రైతులు చెబుతున్నారు. ఎండు పసుపునకు గిట్టుబాటు ధర ప్రస్తుతం రూ.9వేలు మాత్రమే ఉందని రైతుల్లో దిగులు పట్టుకుంది. పచ్చి పసుపు ధరలు మరీ దయనీయంగా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుట్టి పసుపు ధర కేవలం రూ.5వేలులోపు మాత్రమే పలుకుతోంది. రైతులు వట్టి పసుపుగా మార్చేందుకే ఇష్టపడుతున్నారు. గిట్టుబాటు ధర ప్రస్తుతం ఉన్న దిగుబడికి క్వింటా రూ.12వేలకు పైగా నిర్ణయించాలని కోరుతున్నారు. ఈ ఏడాది దిగుబడి కూడా నామమాత్రంగా ఉన్నట్లు రైతులు వాపోతున్నారు. మండల పరిధిలో సుమారుగా 375 ఎకరాల్లో పసుపు పంటను రైతులు సాగుచేశారు. చాపాడు, సీతారామాపురం, అల్లాడుపల్లె, చిన్నగురువలూరు, పెద్దగురువలూరు, లక్ష్మీపేట, కేతవరం, సోమాపురం, సిద్దారెడ్డిపల్లె గ్రామాల పరిధిలో పసుపు పంటను ఉడకబెడుతున్నారు.ఎకరాకు 25 పుట్ల వరకు దిగుబడి వస్తోంది. తెగుళ్ల బారిన పడిన పంట మాత్రం 20 క్వింటాళ్లకే పరిమితం అవుతోంది. పసుపు పంట సాగుకు ఎకరాకు రూ.1లక్ష నుండి రూ.1.30 లక్ష వరకు ఖర్చులు అయ్యాయని రైతులు తెలిపారు. ఏడాది పంట కావడంతో విత్తనం కొనుగోలు దగ్గర నుండి సాగు, కూలీలు, ఎరువులు, మందులు కలిపి అధికంగా ఖర్చులు అవుతున్నాయని వారు పేర్కొంటున్నారు. మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట, బి.మఠం మండలాల్లో 2500 ఎకరాల్లో పసుపు పంటను రైతులు సాగుచేశారు. మైదుకూరు మండలంలో సాగైన 1,125 ఎకరాల్లోని పసుపు పంటను రైతులు విత్తన పసుపు కోసం దుక్కిళ్లు సాగించలేదు. ఏప్రిల్ చివరి వారం, మే నెలల్లో దుక్కిళ్లు సాగిస్తామని రైతులు తెలిపారు. పసుపు ధరలు కడప మార్కెట్‌లో కంటే మహారాష్ట్ర శాంగ్లీ మార్కెట్‌లో రూ. వెయ్యి ఎక్కువగా ఉన్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఉడికించిన పసుపు కొమ్ములను ఆరబెట్టిన రైతులు

ప్రభుత్వ భూముల ఆక్రమణపై ప్రత్యేక సర్వే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

పజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణపై స్పెషల్ ఆఫీసర్ శిరీషాతో ప్రత్యేక టీమ్‌తో సర్వే చేయించి, ఆ భూముల సమాచారం సేకరించి అర్హులైన పేద ప్రజలకు పంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే, బద్వేల్ ఆర్‌డిఒ చంద్రమోహన్ మాట్లాడుతూ మండలంలో 20 రెవెన్యూ గ్రామాలున్నాయని, 14 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తయిందన్నారు. భూ రీసర్వే జరిగిన గ్రామాల్లో రికార్డులు చక్కదిద్దామన్నారు. భూ అక్రమ దారులపై తన పోరాటం కొనసాగిస్తానన్నారు. నాయకులు, ప్రజలు పూర్తి స్థాయిలో సహకరిస్తే పేదవారికి న్యాయం చేస్తానన్నారు. మండలంలో భూ సమస్యలు అధికంగా ఉండడంతో హత్యలు చేసుకునే వరకు దారి తీస్తున్నాయన్నారు. ప్రభుత్వ భూములపై సర్వేకు ప్రతిరోజు రిపోర్ట్ అడిగి తెలుసుకుని పర్యవేక్షణ చేస్తానన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ దామో దర్ రెడ్డి, డిటి జాన్సన్, పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, మండల నాయకులు ఎల్లటూరు సాంబశివారెడ్డి, పూజ శివయ్య, ముడమాల పోలరెడ్డి, ఎస్సార్ శ్రీనివాసులరెడ్డి, మఠం పిటిషనర్ శంకర్ బాలాజీ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరగుంటపల్లి, సింహాద్రిపురం శాఖ గ్రంథాలయం లైబ్రరియన్లు గంగాదేవి, శేఖర్ కోరారు. సోమవారం వేసవి సెలవుల కారణంగా ఆయా గ్రంథాలయాలలో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిక్షణ శిబిరం జూన్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పిల్లలను వేసవిలో బయట తిరగకుండా, సెల్‌ఫోన్ చూడకుండా గ్రంథాలయానికి పంపించి కథలు చదవడం, చెప్పటం, ఆటపాటలతో పిల్లల్లో నైపుణ్యాన్ని వెలికి తీయడానికి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు.

చాపాడు : వేసవి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఎపిఎం శ్రీధర్ సూచించారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆ అధికారి శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో అన్ని అంశాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతిరోజు ఒక అంశంపై అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జానకిరామ్, నక్కలదిన్నె బిడిఎస్ రవిశంకర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి శివశంకర్‌రెడ్డి

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు చేరవచ్చు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సేవలు వెల కట్టలేనివని, విద్యార్థి దశ నుంచి ఎవరైతే క్రమశిక్షణ కలిగి ఉంటారో వారు ఉత్తమ పౌరులుగా ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఎస్‌సిఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్ అధినేత సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఉచిత కోచింగ్ ముగింపు సమావేశంలో సోమవారం ఆయన ముగింపురోజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఈ ఏడాది ప్రభుత్వం నిర్వహిస్తున్న పాలిసెట్, ఎపిఆర్‌జెసి ప్రవేశాల నిమిత్తం స్థానిక సత్రం బడిలో నిర్వహించిన ఉచిత కోచింగ్ కార్యక్రమం సోమవారం ముగిసింది. లింగాల ఎంఇఒ రామ కృష్ణయ్య మాట్లాడుతూ పాలిసెట్‌లో విద్యార్థులు పొందే ర్యాంక్ వారి భవిష్యత్తు విజయాలకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. అనంతరం మాక్ పాలిసెట్ (నమూనా పరీక్షల)లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సుందరేశ్వర్, దుర్గా నాగేంద్ర, నందివర్ధన్ రెడ్డి.. బాలికల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సహన్, శ్రావణి, యామినికి సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం రామసుబ్బారెడ్డి, వెంకట నారాయణ, కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, అమర్ నాథ్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, నాగార్జున రెడ్డి, విజయానందన్ రెడ్డి, శివ గంగాధర్ రెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగం నాయకులు రాఘవేంద్ర రెడ్డి, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే ఆరోగ్యకరం

ప్రజాశక్తి - ముద్దనూరు

రసాయన రహిత వ్యవసాయం ఆరోగ్యానికి హానికరమని, ప్రకృతి వ్యవసాయమే ఆరోగ్య కరమని ముద్దనూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకట సుబ్బయ్య తెలిపారు. స్థానిక మహిళా మండలి సమాఖ్య భవనంలో సోమవారం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం గురించి ఖరీఫ్ ప్రణాళికపై వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులకు ఎఒ వెంకటక్రిష్ణారెడ్డి సమావేశం నిర్వహించారు. రైతులు సహజ సిద్ధసాగుపై దృష్టి సారిం చాలన్నారు. ప్రపంచం ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతుందన్నారు. ఖరీఫ్ ప్రణాళికలు తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డివిజనల్ మోడల్ మేకర్ నూజహత్, మండల అధ్యక్షులు రాజుల సురేంద్రనాథ్ రెడ్డి, వెలుగు ఎపిఎం అపర్ణ దేవి, సిబ్బంది రామసుధ, మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎంయు ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఎపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సోమ వారం కార్మికులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో కమిటీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కారం కోసం రెండురోజులు నిరాహార దీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు దీక్షలో డ్రైవర్లు ఎంపీ రావు ఎస్ఎం అలీ, టిఆర్ఎస్ నరసయ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా

ఎర్రగుంట్ల : పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు వాడితే రూ.5వేలు జరిమానా కట్టాల్సి వస్తుందని నగర పంచాయతీ కమిషనర్ శేషఫణి దుకాణదారులను హెచ్చరించారు. పట్టణంలో చిరు వ్యాపారులు, దుకాణదారులతో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల ఆఖరి వరకు గడువు ఇస్తున్నట్లు చెప్పారు. తర్వాత ప్లాస్టిక్ కవరు డస్ట్ బిన్‌లో కనిపించినా చట్టరీత్య చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ వస్తువులు ఏమీ ఉన్నా జరిమానా విధిస్తామన్నారు. ప్లాస్టిక్ వలన పర్యావరణం కలుషితమవుతుందని తెలిపారు. ప్లాస్టిక్ వెదజల్లే విషవాయువులతో చాలా రోగాలు వస్తాయని తెలిపారు. భావితరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేధించిందని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ పుల్లయ్య పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై దృష్టి పెట్టండి

పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి భజన తగ్గించుకొని శాంతిభద్రతల మీద దృష్టి పెట్టాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు నానాటికీ తీసికట్టు నాగంభట్లు అన్నట్లు ఉందన్నారు. కూటమి పరిపాలనలో ఎవరికీ రక్షణ లేదన్నారు. రాష్ట్రంలో వేట కొడవళ్లు వీరవిహారం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం, డ్రగ్స్, గంజాయి, జూదం, బెట్టింగులు విచ్చలవిడిగా సాగుతున్నట్లు చెప్పారు. పట్టపగలు కర్నూలు జిల్లా ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, మాజీ జెడ్పీటీసీ సభ్యులు చిప్పగిరి లక్ష్మి నారాయణను టిప్పర్‌తో ఢీకొట్టి వేట కొడవళ్లతో అతి దారుణంగా నరికి చంపారన్నారు. ఈనెల 22న ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం, అమ్మనబ్రోలుకు చెందిన టిడిపి నేత వీరయ్య చౌదరిని కూడా ప్రత్యర్థులు చంపారన్నారు. ఇలా చెబుతూ పోతే కొండవీటి చాంతాడు అవుతుందని తులసిరెడ్డి అన్నారు. నేర చరిత్ర గల ఎమ్మెల్యేలలో ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. 79 శాతం మంది ఎమ్మెల్యేలకు నేర చరిత్ర ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం అంతా బాగుంది, స్వర్ణాంధ్ర, సంతోష ఆంధ్ర, సంపద ఆంధ్ర అంటూ డైలాగులు చెబుతున్నారని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా డైలాగులు మానుకొని, కాంగ్రెస్‌నేత లక్ష్మి నారాయణను చంపిన వారిని చట్టపరంగా శిక్షించాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

ఫేస్ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నిబంధనలు పాటించని ఫేస్ జూనియర్ కాలేజీపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు కత్తి ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ గంగయ్యకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేస్ జూనియర్ కాలేజీపై చర్యలు తీసుకోవడంలో ఆర్‌జెడి, ఆర్ఐఒ విఫలమయ్యారని ఆరోపించారు. నీట్, జెఇఇ మెయిన్స్, ఎంసెట్ వంటి పేర్లతో కోచింగ్ సెంటర్‌ను కాలేజీగా మార్చారన్నారు. గతేడాది అనుమతి లేకున్నా కాలేజీ నడిపి ఇంటర్ అడ్మిషన్లు చేసుకుంటే సంబంధిత అధికారులు ఇలాంటి కాలేజీలపై చూసీచూడనట్లు వ్యవహరించారన్నారు. మోసపూరిత కాలేజీలపై చర్యలు తీసుకొని గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత నాయకుడు బాబు, ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య జిల్లా కన్వీనర్ బయన్న పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన జాకోబ్‌తో పోలీసులు

పోలీసుల స్పందన భేష్..!

ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడిన వైనం

ప్రజాశక్తి - ఖాజీపేట

సకాలంలో పోలీసులు స్పందించడంతో ఓ వ్యక్తి ప్రాణాలు నిలిచాయి. ఖాజీపేట కానిస్టేబుల్ మాధవరెడ్డి ఆత్మహత్యకు పాల్పడుతున్న వ్యక్తిని కాపాడగలిగారు. వివరాలిలా ఉన్నాయి. జమ్మలమడుగు నియోజకవర్గం పెద్దముడియం మండలం గరీసనగర్‌కు చెందిన జాకోబ్ ఇంట్లో ఘర్షణ పడి కడపకు వెళుతూ ఖాజీపేటలో దిగాడు. అనంతరం నాగసానిపల్లె సమీపానికి వెళ్లి.. తాను పురుగులు మందు తాగుతున్నానని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చాడు. వెంటనే కుటుంబ సభ్యులు డయల్ 100కు చేరవేశారు. ఖాజీపేట పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ మాధవరెడ్డి సంఘటన ప్రదేశానికి వెళ్లి చాకచక్యంగా జాకోబ్‌ను అదుపులోకి తీసుకుని, కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. క్షణికావేశంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సబబు కాదని, కుటుంబంతో సంతోషంగా ఉండాలని, సమస్యలుంటే ధైర్యంగా ఎదుర్కోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు.

పిచ్చినాయుడు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

పిచ్చినాయుడు మృతి పార్టీకి తీరనిలోటు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పత్తూరు మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు సారె పిచ్చినాయుడు కుటుంబాన్ని సోమవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పరామర్శించారు. పిచ్చినాయుడు కొంత కాలంగా కేన్సర్‌తో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్యే పరామర్శించి, ఓదార్చారు. పిచ్చినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టిడిపి ఆవిర్భావం నుంచి బలోపేతానికి పిచ్చినాయుడు ఎంతగానో కృషి చేశారని ప్రశంసించారు. సర్పంచ్‌గా అభివృద్ధికి ఎంతగానో పాటు పడ్డారని కొనియాడారు. పిచ్చి నాయుడు మృతి పార్టీకి తీరని లోటన్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ, రాష్ట్ర ముస్లిం మైనారిటీ నాయకులు సిద్దారం ఖదీరులా, సీనియర్ నాయకులు నిగినేని పుల్లయ్య నాయుడు, నాయకులు సారే రామానాయుడు, ఢాంఖాన్‌పల్లె జానకీరామ్ నాయుడు, గంగి నాయుడు, సరిటాల వీరయ్య, జండాలు మహబూబ్ బాషా, బ్రహ్మ నాయుడు పాల్గొన్నారు.

అన్ని విధాలా అండగా ఉంటా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన మైదుకూరు మున్సిపాలిటీ 5వ వార్డు టిడిపి కౌన్సిలర్ ఖాదర్ బాషా కుటుంబ సభ్యులకు పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. ఖాదర్‌బాషా కుటుంబ సభ్యులను సోమవారం ఆయన పరామర్శించారు. పార్టీకి ఖాదర్‌బాషా లేని లోటు తీరనిదని పేర్కొన్నారు. బంధువులను అడిగి రోడ్డు ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. ఖాదర్‌బాషా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లు, టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి కందుల దుర్గేష్‌కు సన్మానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కడప జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అక్కులుగారి విజయ్ కుమార్ రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేశారు. అనంతరం పులివెందుల స్థితిగతులను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

మహబూబ్ బాషాకు సత్కారం

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందులకు చెందిన హజ్‌హౌస్ కమిటీ డైరెక్టర్ నైనా మహబూబ్ బాషాను సోమవారం ఘనంగా సత్కరించారు. వేంపల్లె మండల మైనార్టీ కార్యదర్శి సయ్యద్ పీరా సాహెబ్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. హజ్‌హౌస్ కమిటీ డైరెక్టర్‌గా మహబూబ్ బాషా ఎన్నికైనందుకు సయ్యద్ పీరా సాహెబ్ శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. టిడిపి ముస్లిం మైనార్టీలకు కూడా సముచిత స్థానం కల్పించిందన్నారు. కష్ట కాలంలో పార్టీ కోసం కృషి చేసిన వారికి సముచిత స్థానం ఉంటుందనే దానికి ఇది నిదర్శనమన్నారు. ప్రభుత్వం ద్వారా ముస్లిం మైనార్టీలు హజ్ చేసేందుకు కృషి చేయాలని సయ్యద్ కోరారు.

పాస్టర్స్‌కు ఉపకార వేతనం హర్షణీయం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పాస్టర్స్‌కు ఉపకార వేతనం పట్ల జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌సిఎం చర్చిలో పాస్టర్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డితో కలిసి హర్షం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం పక్కన ఆర్‌సిఎం చర్చిలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్స్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి సార్ థ్యాంక్‌యూ అంటూ నినాదాలు చేశారు. క్రిస్టియన్ సెల్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పాస్టర్లుతో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన భూపేష్ సుబ్బరామి రెడ్డి వారిని ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు స్వామి దాసు, రాష్ట్ర క్రిస్టియన్ సెల్ ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, సేవకులు, తెలుగుదేశం పార్టీ క్రిస్టియన్ సెల్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అభినందన సభలో మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి